క్లుప్తంగా

వికాస ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్ స్పందన హాలు వద్ద వికాస ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. వేసవి తాపం నుంచి అర్జీదారులు ఉపశమనం పొందేందుకు ఇకపై ప్రతి వారం ఈ కేంద్రాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, వికాస పీడీ కె.లచ్చారావు, వికాస సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మోసపూరిత రాజకీయాలు సహించం

కాకినాడ సిటీ: తెలంగాణలో ప్రజలకు ఏమీ చేయలేని బీఆర్ఎస్ ఆంధ్రాలో మోసపూరిత రాజకీయాలు చేస్తే సహించేది లేదని బీజేపీ మీడియా విభాగం రాష్ట్ర ప్రతినిధి ఎనిమిరెడ్డి మాలకొండయ్య హెచ్చరించారు. సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతర పోరాటం చేస్తోందన్నారు. విశాఖ ఉక్కు విషయంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే దానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ అనే దొంగ పార్టీ ఇప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రాజకీయం చేయడాన్ని మాలకొండయ్య తీవ్రంగా విమర్శించారు. తెలంగాణలో ఉన్న గనులను కాపాడుకోలేని వారు ఇక్కడికి వచ్చి కార్మిక సంఘం నాయకులను, ప్రజలను మోసం చేస్తే ఇక్కడి నుంచి తరిమికొట్టే పరిస్థితి వస్తుందని మాలకొండయ్య హెచ్చరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని పేదలు, రోగులకు సోమవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ లింగమల్లు, లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగిరెడ్డి, శ్రీవాణీ, న్యాయవాది యనమల రామం, డాక్టరు శిరీష, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

540 మందికి కళ్లజోళ్ల పంపిణీ



ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తున్న నిర్వాహకులు

కరప: గ్రామంలో సోమవారం కాకర్ల బుజ్జిబాబు చౌదరి, భువనేశ్వరి దంపతులు 540 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీచేశారు. గత నెలలో స్థానిక ఎస్టేర్ పాఠశాల ఆవరణలో కాకర్ల పాపారావు చౌదరి జ్ఞాపకార్థం బుజ్జిబాబు, రాజమహేంద్రవరం సత్యకిరణం చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేయగా, కాకినాడ కిరణ్‌కంటి ఆసుపత్రి వైద్యబృందం కంటిపరీక్షలు నిర్వహించారు. ఆ శిబిరంలో 540 మందికి కళ్లజోళ్లు అవసరమవుతాయని గుర్తించారు. లబ్ధిదారుల అద్దాల పవర్‌ను బట్టి కళ్లజోళ్లు తయారుచేసి, కరప తీసుకుచ్చి అందరికీ అందజేశారు. కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం మేనేజర్ పి.సత్యనారాయణ, చోడపునీడి వెంకటరమణ, మండా త్రిమూర్తులు, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యమహా ఎఫ్‌జడ్ఎక్స్ బైక్ ఆవిష్కరణ



బైక్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

బాలాజీచెరువు: కాకినాడ సిరి యమహా షోరూంలో కొత్తగా రూపొందించిన యమహా ఎఫ్‌జడ్ఎక్స్ బైక్‌ను సోమవారం ఆవిష్కరించారు. డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి దీనిని ఆవిష్కరించి మొదటి కొనుగోలుదారుకు అందజేసారు. సరికొత్త ఫీచర్స్ ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, ఎల్ఈడీ ఫ్లాష్ లైట్, ఓబీడీ టూ ఫీచర్ కలిగిన సరికొత్త బైక్ అని షోరూం అధినేత చింతం తమ్మయ్యనాయుడు, ఏరియా సేల్స్ మేనేజర్ అన్వర్ తెలిపారు.

పోలీస్ స్పందనకు 43 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన అదనపు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. వివిధ సమస్యలకు సంబంధించి 43 ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు.

యానాం మద్యం స్వాధీనం

యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల్ని సెబ్ అధికారులు అరెస్టు చేసి ఆటో సీజ్ చేశారు. రూ.25 వేలు విలువ చేసే ఈ మద్యాన్ని కాకినాడ పగడాలపేట వద్ద కాకినాడ సౌత్ సెబ్ స్టేషన్ సిబ్బంది పట్టుకొని కేసు నమోదు చేశారు.

మండే ఎండల్లో మజాగా..

- సీజనల్ వ్యాపారంతో జీవనోపాధి
- పల్లెల నుంచి పట్టణాలకు వలస

బోట్‌క్లబ్: ఎండలు మండుతున్నాయి. బయటకు వెళితే గొంతు ఎండిపోతోంది. ఇందుకు శీతల పానీయం తప్ప మరో గత్యంతరం లేదు. అవసరం, అవకాశం ఉన్న చోటే కదా నాలుగు రాళ్లు వెనకేసుకునేది. పొట్టచేత పట్టుకుని 'శీతల' ఉత్పత్తులతో వ్యాపారాలకు పల్లె జీవులు పట్టణాల బాటపట్టాయి. సర్పవరం జంక్షన్, బోట్‌క్లబ్ పార్కు, నాగమల్లితోట జంక్షన్, జేఎన్‌టీయూకే, భానుగుడి, బాలాజీచెరువు, జగన్నాథపురం, జేడీప్ సెంటర్ ఇలా చాలాచోట్ల శీతల పానీయాల దుకాణాలు కన్పిస్తున్నాయి. పలు సెంటర్లలో ఐస్‌క్రీం దుకాణాలు పుచ్చకాయలు దుకాణాలు వెలిసాయి.

ఫ్రూట్ సలాడ్‌లు..

మార్కెట్‌లో దొరికే వివిధ రకాల ఫ్లేవర్లతో ఫ్రూట్ సలాడ్‌లు తయారుచేస్తున్నారు. ఆరెంజ్, నిమ్మ, మిక్స్‌డ్ ఫ్రూట్ తదితర సలాడ్‌లు గ్లాసును రూ.20 వరకూ విక్రయిస్తున్నారు.

చెరుకు రసం, నిమ్మసోడా..

చెరుకురసం నిమ్మసోడా బండ్లు ఎక్కడ చూసిన కనిస్తున్నాయి. నిమ్మకాయ మసాలా సోడా, నిమ్మకాయ సోడా, అల్లంతో చెరుకురసం, నిమ్మకాయ చెరుకు రసం ఇలా రకరకాలుగా నిమ్మకాయతో చెరుకు రసం ఉన్న గ్లాసు రూ. 20 విక్రయిస్తున్నారు.



ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో చెరకురసం తాగుతున్న ప్రజలు

ఐస్‌క్రీం పార్లర్లకు గిరాకీ..

ఉష్ణతాపం నుంచి ఉపశమనానికి ఐస్‌క్రీమ్‌లు కూడా ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయి. స్థానిక కుళాయిచెరువు ఎదురుగా ఉన్న ఐస్‌క్రీం పార్లర్లు వినియోగదారులతో కిటకిటలాడతున్నాయి. ఫ్లేవర్, రకం బట్టి ఇవి రూ.20 నుంచి రూ.80 వరకూ విక్రయిస్తున్నారు.



రాజేశ్వరినగర్‌లో పుచ్చకాయలు తింటున్న ప్రజలు

విరివిగా ముంజెలు, కొబ్బరి బొండాల విక్రయాలు..

నగర సమీప గ్రామాలతో పాటు పెద్దాపురం, రాజానగరం, తదితర గ్రామాల నుంచి తాటి ముంజెలు విక్రయించేందుకు అధిక సంఖ్యలో యువకులు నగరానికి వచ్చి ప్రజల తాపం తీర్చి వెళ్లిపోతున్నారు. డజన్ ముంజెలు రూ. 50 నుంచి రూ. 60కి విక్రయిస్తున్నారు. ప్రతిరోజు బండి పెట్రోల్, సాధారణ ఖర్చులు పోను సుమారు రూ.400 నుంచి రూ.500 వరకూ గిట్టుబాటు కావడంతో అచ్చంపేట జంక్షన్ మొదలుకొని సుమారు 30 నుంచి 40 విక్రయ కేంద్రాలు వెలిసాయి. అలాగే కొబ్బరి బొండాలను విక్రయిస్తున్నారు.

15 ఏళ్లుగా విక్రయిస్తున్నా



మాది పిఠాపురం 15 ఏళ్లుగా వేసవిలో చెరుకురసం విక్రయిస్తున్నాం. ప్రస్తుతం పది రోజులుగా ఎండలు విపరీతంగా ఉండడంతో వ్యాపారం ఊపందుకుంది. అన్నీపోను రూ.300 నుంచి రూ.400 వరకూ మిగులుతుంది.

– గుర్రుర్తి రమణ, చెరుకురసం విక్రయదారుడు

వేసవిలోనే వ్యాపారం..



ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రతి ఫ్రూట్ జ్యూస్‌కు ఎంతో గిరాకీ ఉంది. నాతోపాటు ఒక పనివాడు ఇక్కడ పనిచేస్తున్నాడు. పెట్టుబడి పోను రోజుకు రూ.500 పైగా లాభం వస్తుంది. ఎండాకాలం వెళ్లడం తోనే జ్యూస్ సెంటరూ మూసేస్తాను.

కోటపురెడ్డి రాజు, ఫ్రూట్ జ్యూస్ విక్రయదారుడు

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

స్పందనలో ఏడీసీ నాగ నరసింహారావు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను ఆయన సంబంధిత అధికారుల ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీలకు నిర్ణీత వ్యవధిలో, నాణ్యమైన పరిష్కారం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. న్యాయపరమైన, ఆర్థిక అంశాలతో ముడిపడిన సమస్యలు మినహా మిగిలిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందించవచ్చునన్నారు. కార్యదర్శి ఎం.ఏసుబాబు డీఈ వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ సుభాష్‌చంద్రబోస్

- సీఎం జగన్ పాలన సువర్ణాధ్యాయం
- ఎంపీ, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ సుభాష్‌చంద్రబోస్
- పోలవరంలో ఎమ్మెల్యే కన్నబాబుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం

కాకినాడ రూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని ఎంపీ, వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం తమ్మవరం గ్రామ పరిధిలోని పోలవరంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. తొలుత వైఎస్ జగన్‌మోహన్‌పురంలోని పేదలు నిర్మించుకున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ పాలన సువర్ణాధ్యాయం అన్నారు. వర్గాలకు అతీతంగా, అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మరోసారి విజయం సాధిస్తారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ పోలవరం పూర్తిగా మత్స్యకారులు ఉండే గ్రామమని, ఇక్కడ ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురు కొడుకులు కూడా ఉండడంతో అర్హులందరికీ పట్టాలు మంజూరు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో అధికారులతో కలసి గ్రామాలు సందర్శించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సీఎం జగన్ నవరత్న పథకాలను అమలు చేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కాకినాడ రూరల్, కరప జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, తమ్మవరం సీనియర్ నాయకుడు గొల్లపల్లి సత్తిరాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, ఎంపీటీసీ పల్లా భాస్కర్, డీఎల్‌డీవో నారాయణమూర్తి, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కమిషనర్ మహేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్



కమిషనర్ రమేష్‌ను సత్కరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా రావిరాల మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉదయం 10.30కు కమిషనర్ కె.రమేష్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 2016 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన ఆయన గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తొలిసారి నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన కమిషనర్‌కు అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాంశాలు, నగరపాలక సంస్థకు చెందిన ముఖ్య అంశాలపై దృష్టి పెడతామన్నారు. కమిషనర్‌ను ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ హరి ప్రసాద్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కె.సత్యనారాయణ, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఏవో శిరీష్, ఉద్యాన శాఖ ఏడీ టీవీ సిరిల్, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు పలువురు డీఈలు, ఏఈలు ఉన్నారు.

కమిషనర్ రమేష్‌కు ఆత్మీయ వీడ్కోలు

నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్‌కు సోమవారం కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏడీసీ నాగ నరసింహారావు మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కమిషనర్ రమేష్ ఎంతో సహకారం అందించారన్నారు. కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజా సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించే ఆయన వద్ద పనిచేయడం ఎంతో అదృష్టమన్నారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో సంతృప్తికరమైన సేవలు అందించగలిగానన్నారు. ఆర్వో చెక్కా రమణ, ఆయా విభాగాలు సూపరింటిండెంట్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎంపీ గీత, శివప్రసన్న తదితరులు



కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, చంద్రకళాదీప్తి తదితరులు

- ఊరూవాడా సందడే సందడి
- నగరాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహణ
- పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనపై వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు ఉత్సాహంగా సాగుతోంది. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నగరంలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్లుగా విభజించారు. పార్టీ నేతలు రాగిరెడ్డి సుబ్బారావు, సుంకర విద్యాసాగర్, జగన్నాథన్ విజయ్‌కుమార్, బాలప్రసాద్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ కేడర్ ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన ప్రశ్నావళిని ప్రజల ముందుంచి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. టీడీపీ పాలనలో హామీల ఉల్లంఘన, సీఎం జగన్ పాలనలో హామీలకు కట్టుబడి పనిచేస్తున్న వైనాన్ని వివరిస్తున్నారు. వెళ్లిన ప్రతి ఇంటికి పార్టీ ఇచ్చిన స్టిక్కర్లను అంటించి ప్రజల మద్దతు కోరుతున్నారు.

9వ డివిజన్‌లో ఎంపీ, ఎమ్మెల్యే

నగరంలోని 9వ డివిజన్‌లో ఎంపీ వంగా గీత, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నసాగర్ పాల్గొనగా, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి జగన్నాథపురం ప్రాంతంలో పర్యటించి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎక్కడికక్కడ పార్టీ కేడర్‌కు సూచనలిస్తూ ఉత్సాహపరిచారు. కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, చోడిపల్లి ప్రసాద్, మీసాల దుర్గాప్రసాద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్ద మసీదు అభివృద్ధికి సహకారం

కాకినాడ: రహదారి విస్తరణతో నష్టపోతున్న పెద్ద మసీదు పునర్నిర్మాణానికి అన్ని విధాలా తోడ్పాడతానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా మసీదు సెంటర్‌లోని జామియా మసీదులో సోమవారం ఇఫ్తార్ విందులో అయన పాల్గొన్నారు. రానున్న రంజాన్ నాటికి మసీదును సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తానన్నారు. ఆది నుంచి తనకు ముస్లిం మైనారిటీలు అండగా ఉన్నారని, వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు ఇజాదుద్దీన్, కార్యదర్శి నాజీర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రహ్మాన్ ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్‌ఖాన్, పార్టీ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు బాషా, నగర అధ్యక్షుడు ఖాలిదుద్దీన్ వలీ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

సంక్షిప్తంగా..

పాలకుల విధానాలు మారేలా ఉద్యమించాలి : మాజీ ఎమ్మెల్సీ

కాకినాడ సిటీ: పాలకుల విధానాలు మారేలా ఉద్యమాలు సాగాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక యుటీఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అదానీ అవినీతి-క్రోనీ క్యాపిటలిజం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ రంగాన్ని ఉపయోగించుకుని ప్రైవేటు పెట్టుబడిదారులు బాగా లాభాలు సంపాదించుకున్నారన్నారు. సమావేశంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ ఐ.ప్రసాదరావు, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి అన్నారాం, సీఐటీయూ అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి బేబీరాణి పాల్గొని మాట్లాడారు.

అవయవ దానానికి అంగీకారపత్రం

కరప: గ్రామానికి చెందిన పాత్రికేయుడు డీహెచ్‌వీ సాంబశివరావు తన మరణానంతరం అవయవాలు దానం చేసేందుకు అంగీకార ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం కాకినాడ ట్రస్ట్ హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణకు అందజేశారు. సాంబశివరావు తండ్రి దేవగుప్తాపు వీరభద్రరావు ఇటీవల మృతిచెందారు. సోమవారం తండ్రి దశదిన కార్యక్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన ప్రకటించారు. సాంబశివరావు సోదరుడు మూర్తి సైతం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి గతంలోనే తన అవయవాలను దానం చేస్తూ అంగీకార పత్రాన్ని అందజేశారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరప: స్థానిక ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జేసీ ఇలక్కియ మంగళవారం ప్రారంభిస్తారని, రైతులందరూ పాల్గొనాలని ఎంఏఓ ఏవీ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత సీహెచ్‌సీ రైతు గ్రూపులకు రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

బసవయ్య సేవలు మరువలేనివి

కరప: ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు పల్లేటి బసవయ్య సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. మండలం గొర్రిపూడిలో సోమవారం బసవయ్య సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు జి.సూరిబాబు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

కరప: మండలం వేళంగిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రమ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి జరిగిన వాలీబాల్ మ్యాచ్‌లలో వేళంగి ఈగల్స్‌పై వేళంగి ఫైటర్స్ జట్టు, వేళంగి స్పైడర్స్‌పై వేళంగి ఈగల్స్ జట్టు విజయం సాధించాయి. సోమవారం వేళంగి టైగర్స్, వేళంగి వారియర్స్ జట్లు తలపడగా వారియర్స్ విజేతగా నిలచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా దడాల సతీష్ నిలిచాడు. రాత్రికి వాలీబాల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వేళంగి గ్రాడ్యుయేట్ ప్రతినిధులు ముడిగి కృష్ణ, ఎ.దుర్గాప్రసాద్, ఎర్రా విక్రమ్, చిట్టూరి అప్పన్న తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హానిమన్‌కు ఘన నివాళి

బాలాజీచెరువు: హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతిని సోమవారం వెంకట్‌నగర్ గాయత్రి హోమియో వైద్యశాలలో నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సలాది సూర్యచంద్ర అధ్యక్షతన హానిమన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ హోమియో వైద్యులు ప్రస్తుత తరానికి మార్గదర్శకులుగా ఉండాలని కోరారు. హోమియో వైద్యులు మనోజ్ఞ, అప్పాజీ, శాస్త్రి, సింధు, సత్యన్వేష్, యశస్వి, సిద్ధిక్ పాల్గొన్నారు.

వాకర్ల ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: హోమియోపతి పితామహుడు హానిమన్ జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. హానిమన్ చిత్రపటానికి హోమియో వైద్యుడు సలాది సూర్యకిరణ్, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు, రాజా తదితరులు నివాళులర్పించారు.

ప్రజా ప్రయోజన ప్రాజెక్టులు రూపొందించాలి

- రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ సందర్శన

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శాస్త్ర, సాంకేతిక యూనివర్సిటీగా కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ప్రజా ప్రయోజన ప్రాజెక్టులు రూపొందించాలని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించి ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జన మైత్రి పోలీస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్, రోడ్డు ప్రమాదాల హాట్‌స్పాట్‌ను గుర్తించే పరికరం, అమెరికా ప్రభుత్వం నుంచి అవార్డు పొందిన హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ప్రస్తుతం విద్యార్థులు రూపొందిస్తున్న హెల్త్‌కేర్ టు హోమ్ మొబైల్ అప్లికేషన్ వివరాలు తెలుసుకున్నారు. ఇటువంటి వాటిని ప్రోత్సహించి ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వామ్యం అవుతున్న వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజును అభినందించారు. ఆయన వెంట రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు కొప్పిరెడ్డి పద్మరాజు, ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ జేవీఆర్ మూర్తి పాల్గొన్నారు.



ఇంక్యుబేషన్ సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, చిత్రంలో వీసీ ప్రసాదరాజు